# 'రుక్మాభట్ల' జిల్లావాసి కావడం అదృష్టం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



రుక్మాభట్ల లక్ష్మీనరసింహస్వామిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీ దేశపతిశ్రీనివాస్

సిద్దిపేట, ఏప్రిల్ 6: గేయ రామాయణాన్ని రచించి తన గొంతుతో పాడి వినిపిస్తున్న రుక్మాభట్ల లక్ష్మీనరసింహ స్వామి జిల్లా వాసి కావడం మనందరి అదృష్టమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో ఆదివారం రామలీల గేయ రామాయణ సిద్దిపేట వాగ్గేయకారుడు రుక్మాభట్ల లక్ష్మీనరసింహస్వామిని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌తో కలిసి ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రుక్మాభట్ల లక్ష్మీనరసింహస్వామి కంఠంలో ఘంటసాల గొంతు వినపడుతుందన్నారు. లక్ష్మీనరసింహ స్వామిని సన్మానించుకోవడం మన బాధ్యత అన్నారు. తండ్రి విధుమౌళిశర్మ స్ఫూర్తితో రుక్మాభట్ల శ్రీరామలీలగేయ రామాయణాన్ని రచించారన్నారు. నేటి సమాజంలో టెక్నాలజీ పెరిగి పాత తరం వాళ్లను కొందరు చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి సర్కారులో రాష్ట్ర స్థాయిలో ఉగాది పురస్కారం లభించిందని, స్వరసాధన సంస్థ తరపున సిద్దిపేటలో తన చేతుల మీదుగా స్వర్ణకంకణ సత్కారం చేసిన విషయాన్ని హరీశ్‌రావు గుర్తుచేశారు. కార్యక్రమంలో కవులు, పండితులు తదితరులు పాల్గొన్నారు.

# కడియం నోరు అదుపులో పెట్టుకోవాలి

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 6: నిత్యం ప్రజల కోసం పనిచేస్తున్న జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్‌ఎస్ ధూళిమిట్ట మండల అధ్యక్షుడు మంద యాదగిరి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడియం శ్రీహరి నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదని, లేకపోతే బీఆర్‌ఎస్ నాయకులు తగిన బుద్ధి చెబుతారన్నారు. జనగామ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తుతున్న పల్లాపై కడియం అనుచిత వ్యాఖ్యలు చేయడం అవివేకమన్నారు. సొంత దవాఖానలో వేలాదిమందికి ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్న ఘనత పల్లా రాజేశ్వర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పనితీరును మెచ్చుకుంటూ ఓ సర్వే సంస్థ రాష్ట్రంలోని 119 మంది ఎమ్మెల్యేల్లో రాజేశ్వర్‌రెడ్డికి 6వ ర్యాంకు ఇచ్చిందని గుర్తుచేశారు. ఎమ్మెల్యే పనితీరుపై జనగామ నియోజకవర్గ ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారనే దానికి ఆసర్వే నిదర్శనమన్నారు. మరోసారి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై చిల్లరమల్లర విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

# రజతోత్సవ సభకు పెద్దఎత్తున తరలిరావాలి

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, ఏప్రిల్ 6: వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు భారీ సంఖ్యలో పార్టీశ్రేణులు తరలిరావాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం దుబ్బాకలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దుబ్బాక మండలంలోని ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు సభకు తరలివచ్చేందుకు వాహనాలు తదితర వసతుల గురించి సమావేశంలో చర్చించారు. త్వరలోనే అన్ని మండలాల వారీగా ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. సభకు తరలి వెళ్లేందుకు సూచనలు, సలహాలు ఇస్తామని, ఇందుకు ముఖ్య నాయకులకు బాధ్యతలు అప్పగిస్తామన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు రాజమౌళి, ఎల్లారెడ్డి, రవీందర్ రెడ్డి, కిషన్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# భగవంతుడిని నిత్యం ఆరాధించాలి



సీతారాములు కల్యాణంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి, ఏప్రిల్ 6: ప్రజలు పనులు చేసుకుంటూనే భగవంతుడిని నిత్యం ఆరాధిస్తే సకల సౌభాగ్యాలు కలుగుతాయని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నా రు. శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకొని మిరుదొడ్డిలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, రామాలయం కమిటీ చైర్మన్ తోట కమలాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సీతారాముల కల్యాణం నిర్వహించగా దుబ్బాక ఎమ్మెల్యే పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, మాజీ సర్పంచ్ రాములు, మాజీ ఎంపీటీసీలు స్వామి, బైరయ్య, నాయకులు సత్తయ్య, వెంకటయ్య, మల్లయ్య, రమేశ్, జ్ఞానేశ్వర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఏఎంసీ మాజీ చైర్మన్‌కు పరామర్శ



ఎడ్ల సోమిరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్

నంగునూరు, ఏప్రిల్ 6: మండలంలోని గట్లమల్యాల గ్రామానికి చెందిన ఏఎంసీ మాజీ చైర్మన్, రాష్ట్ర ఆయిల్‌పామ్ రైతు వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి తండ్రి మల్లారెడ్డి ఇటీవల మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆదివారం అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మాదాసు శ్రీనివాస్, రాగుల సారయ్య, బీఆర్‌ఎస్‌వీ నాయకుడు పరశురాములు పాల్గొన్నారు.

# మల్లన్నను దర్శించుకున్న అడిషనల్ కమిషనర్



అడిషనల్ కమిషనర్ జ్యోతికి స్వామివారి జ్ఞాపిక అందజేస్తున్న రామాంజనేయులు

చేర్యాల, ఏప్రిల్ 6: కొమురవెల్లి మల్లికార్జున స్వామిని ఆదివారం దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ జ్యోతి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పూజల అనంతరం ఆలయ అర్చకులు ఆమెకు స్వామివారి తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్లు శ్రీరాములు, సురేందర్‌రెడ్డి, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, అర్చకులు, సిబ్బంది, ఒగ్గు పూజారులు పాల్గొన్నారు.

# కొమురవెల్లిలో భక్తుల సందడి



కొమురవెల్లి మల్లన్న ఆలయ రాజగోపురం ఎదుట భక్తుల రద్దీ

చేర్యాల, ఏప్రిల్ 6: కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొన్నది. సుమారు 10 వేల మంది భక్తులు ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నట్లు ఆలయవర్గాలు తెలిపాయి. శనివారం సాయంత్రం నుంచే కొమురవెల్లికి చేరుకున్న భక్తులు ఆదివారం స్వామివారిని దర్శించుకోవడంతో పాటు అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడి బియ్యం, కేశఖండన, గంగరేగుచెట్టు వద్ద ముడుపులు కట్టడం వంటి మొక్కులు చెల్లించుకున్నారు. మరికొందరు భక్తులు స్వామివారి నిత్య కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. కొండపైన ఉన్న ఎల్లమ్మను దర్శించుకోవడంతో పాటు బోనం తయారుచేసి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు రాతిగీరల వద్ద ప్రదక్షిణలు, కోడెల స్తంభం వద్ద కోడెలు కట్టి పూజలు చేశారు. ఆలయ ఈవో రామాంజనేయులు, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, పాలక మండలి సభ్యులు, సిబ్బంది, అర్చకులు భక్తులకు సేవలందించారు.

# కల్యాణ వైభోగం

- భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణం
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

జిల్లా వ్యాప్తంగా సీతారాముల కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం శ్రీరాముడు, సీతమ్మల కల్యాణ క్రతువును ఆలయ పండితులు శాస్త్రోకంగా నిర్వహించారు. ఆయా ఆలయాల వద్ద నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

–సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్‌నమస్తే తెలంగాణ, ఏప్రిల్ 6



చిన్నకోడూరు: చౌడారంలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు



చేర్యాల: మల్లన్న క్షేత్రంలోని హనుమాన్ ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న ఈవో తదితరులు



గజ్వేల్: దిలాల్‌పూర్‌లో కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



బెజ్జంకి: గుండారంలో జరిగిన సీతారాముల కల్యాణంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



హుస్నాబాద్‌టౌన్: కల్యాణానికి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకువస్తున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రజితావెంకన్న తదితరులు



గజ్వేల్: ప్రజ్ఞాపూర్‌లో సీతారాముల కల్యాణం మహోత్సవాన్ని జరిపిస్తున్న వేద పండితులు



కోహెడ: కోహెడలోని హరిహర క్షేత్రంలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న పురోహితులు



వర్గల్: నాచగిరి క్షేత్రంలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు



నారాయణరావుపేట: జక్కాపూర్‌లో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



మద్దూరు(ధూళిమిట్ట): లద్నూర్‌లో సీతారాముల కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకుడు కొడకండ్ల రాధాకృష్ణశర్మ



కొమురవెల్లి: గురువన్నపేటలో మంగళసూత్రాన్ని చూపిస్తున్న అర్చకుడు మహాదేవభట్ల ఆనంద్‌శర్మ



సిద్దిన్నపేటలో రాములోరి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు



కొండపాక(కుకునూరుపల్లి): దుద్దెడలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు



హుస్నాబాద్‌రూరల్: పొట్లపల్లిలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 6: సిద్దిపేట నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో ఆదివారం రాత్రి ఐకేపీ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఐకేపీ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. వర్షాలు పడి ధాన్యం తడిచే అవకాశం ఉందని, ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు. గన్నీ బ్యాగ్స్, ప్యాడీక్లీనర్స్, తూకం వేసే కాంటాలు అందుబాటులో ఉంచాలని చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదేశించారు.

# హరీశ్‌రావు పనితీరు మనందరికీ గర్వకారణం



ఎమ్మెల్యే హరీశ్‌రావును కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్‌ఎస్ నారాయణరావుపేట మండల నాయకులు



హరీశ్‌రావును సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్‌హుస్సేన్

సిద్దిపేట,ఏప్రిల్ 6: ఎమ్మెల్యేల పనితీరుపై రాష్ట్ర వ్యాప్తంగా పీపుల్స్‌పల్స్ అనే సంస్థ 118 నియోజకవర్గాల్లో నిర్వహించిన సర్వేలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు మొదటి ర్యాంకు రావడం మనందరికీ గర్వకారణమని మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్‌హుస్సేన్ అన్నారు. ఆదివారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హరీశ్‌రావును ఆయన కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నారాయణరావుపేట మండల నాయకులు హరీశ్‌రావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొనాయగారి ఎల్లయ్య, మాజీ దేవాలయ చైర్మన్ పూసల కిషన్, పార్టీ గ్రామ అధ్యక్షుడు కొంగరి దేవరాజ్, మండల యూత్ అధ్యక్షుడు దీకొండ భాస్కర్ పాల్గొన్నారు.

# 50కోట్ల లిఖిత రామనామాలతో అభిషేకం



గజ్వేల్, ఏప్రిల్ 6: శ్రీరామనవమి సందర్భంగా గజ్వేల్‌కు చెందిన రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామరాజు ఆదివారం గజ్వేల్‌లోని అద్దాల మందిరంలో 50కోట్ల లిఖిత రామనామాలతో సీతారాములకు అభిషేకం చేశారు.

# బీటీ రణదీవే వర్ధంతి



రణదీవే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

గజ్వేల్, ఏప్రిల్ 6: ఆర్థిక అంతరాలతోపాటు సామాజిక అణిచివేతకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య పిలుపునిచ్చారు. ఆదివారం గజ్వేల్‌లోని కార్యాలయంలో బీటీ రణదీవే 35వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రణదీవే దేశంలో కార్మికవర్గాన్ని ఐక్యం చేస్తూ సంఘాల ఏర్పాటుకు, కార్మికుల హక్కుల కోసం పోరాటం చేసి సాధించిపెట్టిన గొప్ప నాయకుడన్నారు. కార్యక్రమంలో బండ్ల స్వామి, కృష్ణమూర్తి, సందిటి రంగారెడ్డి, స్వామి, యాదగిరి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు గిరిజన సంక్షేమ భవన్ ముట్టడి



మాట్లాడుతున్న సత్యంనాయక్

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 6: ట్రైకార్ రుణాలు విడుదల చేయాలని కోరుతూ ఈనెల 7న గిరిజన సంక్షేమ భవన్‌ను ముట్టడించనున్నట్లు లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మాలోతు సత్యంనాయక్, లంబాడ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు భూక్యా కృష్ణనాయక్ వెల్లడించారు. ఆదివారం హుస్నాబాద్‌లోని జీకే ఫంక్షన్ హాల్‌లో లంబాడ గిరిజన సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019–21లో ప్రభుత్వం ట్రైకార్ సంస్థ ద్వారా గిరిజనుల నుంచి వేలాదిగా దరఖాస్తులు స్వీకరించి రూ.219కోట్ల రుణాలు మంజూరు చేసిందన్నారు. చెక్కులను సైతం సిద్ధంచేసి ఆర్థిక శాఖ క్లియరెన్స్‌కు సైతం పంపించిందన్నారు. దాదాపు 30వేలమంది గిరిజన యువతీ యువకులు రుణాల కోసం ఎదురుచూస్తున్నా ప్రభుత్వం ఇవ్వకుండా రద్దు చేసేందుకు కుట్రలు పన్నుతున్నదని ఆరోపించారు. ట్రైకార్‌ను రాజీవ్ యువవికాస్‌లో విలీనం చేయడంతో పథకం కోసం గిరిజనులు దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ కేంద్రాలకు వెళ్తే ఇప్పటికే రుణాలు మంజూరు అయినట్లు చూపిస్తూ దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ట్రైకార్ ద్వారా రూ.10లక్షల వరకు రుణాలు ఇస్తుండగా రాజీవ్ యువవికాస్‌లో నాలుగు లక్షలకే పరిమితం చేశారన్నారు. గిరిజన సంక్షేమ భవన్ ముట్టడికి పెద్దసంఖ్యలో గిరిజనులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో గిరిజన సంఘం నాయకులు భూక్యా వీరన్ననాయక్, భాస్కర్‌నాయక్, అజ్మీర తిరుపతినాయక్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

# సిద్దిపేట అలయన్స్ క్లబ్ సేవా నిరతి




సీతారామచంద్రస్వామి కల్యాణానికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పిస్తున్న క్లబ్ ప్రతినిధులు

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 6: సీతారామ చంద్ర స్వామి కల్యాణ మహోత్సవంలో సిద్దిపేట అలయన్స్ క్లబ్ సేవా నిరతిని చాటింది. ఆదివారం క్లబ్ గవర్నర్ గందె ఈశ్వర్ చరణ్ నిర్వహిణలో సేవా కార్యక్రమాలు జరిగాయి. రామాలయం వద్ద భక్తుల దహార్తిని తీర్చడానికి చల్లివేంద్రం, శంకర్‌నగర్ రామలింగేశ్వర దేవాలయంలో జరిగిన కల్యాణానికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు, శివాజీ నగర్ ప్రసన్నాంజనేయ దేవాలయంలో పెళ్లి వస్త్రాలు, తలంబ్రాలు అందించారు. ఆలయాల వద్ద చల్లివేంద్రాలు ఏర్పాటు చేసి భక్తులకు వేసవి తాపం నుంచి ఉపశమనం కల్పించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఆత్మరాములు, సోమ వనజ, రేణుక, నాగరాణి, మంజుల పాల్గొన్నారు.

# ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

తొగుట, ఏప్రిల్ 6: మద్యానికి బానిసైన వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఎల్‌బంజేరుపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. తొగుట ఎస్సై రవికాంతారావు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బొమ్మ రాజు (32) కుటుంబ సభ్యులతో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. ఇదే క్రమంలో ఎలాంటి పనులు చేయకుండా రాజు నిత్యం మద్యం తాగి వస్తూ ఇంటి వద్ద ఉంటున్నాడు. నిత్యం మద్యం తాగితే కుటుంబం ఏవిధంగా కొనసాగుతుందని భార్య ప్రశ్నించింది. దీంతో ఇంటిలోనే ఉరేసుకొని ఆదివారం రాజు ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# వ్యక్తి దారుణ హత్య



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

గజ్వేల్, ఏప్రిల్ 6: డబ్బుల విషయంలో గొడవ జరగడంతో వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన మండలంలోని కొమటిబండలో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ సైదా తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా హుజుర్‌నగర్ మండలానికి చెందిన చిట్యాలరి ఆంజనేయులు(30) సిద్దిపేట జిల్లా కోమటిబండకు చెందిన ప్రేమలతను 2020లో తీసుకువెళ్లి వివాహం చేసుకున్నాడు. తర్వాత అతను భార్యతో కలిసి హైదరాబాద్, సూర్యాపేట, చేవెళ్ల ప్రాంతాల్లో నివాసం ఉంటూ దొంగతనాలు చేసేవాడు. కొద్ది రోజుల క్రితం వరంగల్ జిల్లాలో చేసిన దొంగతనం కేసులో జైలుకు వెళ్లిన అతను 15రోజుల క్రితం బయటకు వచ్చి గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఆదివారం అత్తగారిల్లు కోమటిబండకు వెళ్లిన అతను అత్తతో డబ్బులు ఇవ్వాలని గొడవపడి ఇంట్లోని వస్తువులు పడేశాడు. అక్కడే ఉన్న పెద్దల్లుడు పిట్టల శివ అతన్ని సముదాయించే ప్రయత్నం చేసినా వినకుండా గొడవ పడ్డాడు. దీంతో పెద్దల్లుడు శివ రాయితో తలపై కొట్టడంతో ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.